క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కూసుమంచి: జూన్ 28 నాటికి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 18 నుండి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఇందుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌ను వారి పరిధిలోని ఏఈఓకు ఆగస్టు 5వ తేదీ లోగా అందించాలని పేర్కొన్నారు. గతంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్న వారు ఏమైనా మార్పులు (నామినీ మరణిస్తే)సరిచేసుకోవచ్చని, వారు ఈనెల 30 లోగా ఏఈఓల వద్ద మార్పులు చేసుకోవచ్చని సూచించారు.

బస్సులో పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


ప్రయాణికురాలికి ఫోన్ అందజేస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ మరచిపోయిన ఫోన్‌ను ఆర్టీసీ సిబ్బంది సదరు ప్రయాణికురాలికి ఆదివారం అందజేశారు. సూర్యాపేట నుంచి ఖమ్మం పాత బస్టాండ్‌కు ప్రయాణించిన మామిళ్లగూడెంకు చెందిన కె.సరిత తన ఫోన్‌ను బస్సులో మరచిపోయి దిగింది. వెంటనే సమాచారాన్ని బస్టాండ్‌లో తెలపగా స్టేషన్ మేనేజర్ సిబ్బందిని అప్రమత్తం చేసి, బస్సు కండక్టర్‌కు సమాచారం అందించగా.. బస్సులో ఫోన్‌ను కండక్టర్ గుర్తించి స్టేషన్ మేనేజర్‌కు అందజేశారు. వెంటనే ఆ ఫోన్‌ను పూర్తి వివరాలు తీసుకొని సదరు ప్రయాణికురాలికి అందజేశారు. బస్సులో మరచిపోయిన ఫోన్‌ను తిరిగి ఇవ్వడంతో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత బస్టాండ్ మేనేజర్ ఆకుతోట శ్రీనివాసరావు, సెక్యూరిటీ కానిస్టేబుల్ అంకతి రమేష్, కండక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి


నిలిచిన వర్షపు నీరు

కూసుమంచి: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీలో పలు సమస్యలు నెలకొన్నాయని, ఆ సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నాయకులు కాలనీ ఇళ్లను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో కొద్దిపాటి వర్షానికే నడవలేని పరిస్థితి నెలకొందని, తాగునీటి సమస్యతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని స్పందించి కాలనీలో సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండా ఉపేందర్‌రెడ్డి, నరేష్, చంద్రశేఖర్ గౌడ్, శంకర్‌నాయక్, వెంకటరెడ్డి, దుర్గారావు, విజయపాల్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	డార్లింగ్
సాయిరాం	క్రైమ్ రీల్
శ్రీనివాస	భారతీయుడు 2

\- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	68	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	58		20
కాకర	60	చుక్కకూర	4
బోడ కాకర	240		20
బీర	36	తోటకూర	5
దొండ	30		20
పొట్లకాయ	50	గోంగూర	5
చిక్కుడు	60		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		25
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	56		25
క్యాప్సికం	68		

\-ఖమ్మం వ్యవసాయం

రహదారి వెంట విక్రయిస్తున్న రెయిన్‌కోట్‌లు, గొడుగులు



వానొస్తే.. వ్యాపారమస్తు!

గొడుగులు, రెయిన్ కోట్‌లకు భలే గిరాకీ

- రహదారుల వెంట జోరుగా అమ్మకాలు
- నాణ్యత, సైజును బట్టి ధరలు
- ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విక్రయిస్తున్న కొందరు
- పలువురు ఉపాధి పొందుతున్న వైనం

ఖమ్మం సహకారనగర్: సీజనల్ వ్యాపారం చేసే వారికి వర్షాకాలం కలిసి వస్తోంది. ముసురు పెడితే రోడ్డు పక్కనే గొడుగులు, రెయిన్ కోట్‌లు విక్రయిస్తున్నారు. ఇలాంటి వ్యాపారాన్ని ఎంచుకున్న వారు అక్కడి పరిస్థితులకు తగినట్లుగా విక్రయాలను చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ప్రధాన రహదారులే మార్కెట్లు

వానొస్తే వారికి పండగ అన్నట్లుగా వారి వ్యాపారం జోరందుకుంటుంది. ప్రధానంగా గొడుగులు, రెయిన్‌కోట్‌లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. నగరంలోని ప్రధాన రహదారులను ఉపాధి మార్గాలుగా ఎంచుకుని వారు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి ఎప్పుడు వర్షం వచ్చినా వారి వ్యాపారాన్ని పలు ప్రధాన రహదారుల వెంటకు తీసుకొస్తుంటారు.

నాణ్యతను బట్టి ధరలు..

గొడుగులు, రెయిన్ కోట్లు నాణ్యత, సైజులను బట్టి ధరలు నిర్ణయించి విక్రయాలు చేస్తున్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్రతీ ప్రధాన సెంటర్లలో తాము విక్రయాలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. అకస్మాత్తుగా వర్షం వచ్చిన సమయాన వీటిని అమ్ముతూ పలు కుటుంబాల వారు ఉపాధి పొందుతున్నారు.

ఇతర రాష్ట్రాల వారికీ ఉపాధి.

నగరంలో జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారూ వివిధ రకాల విక్రయాలు చేపడుతున్నారు. సీజన్‌ను బట్టి వివిధ రకాల సామగ్రిని తీసుకొచ్చి అమ్ముతుంటారు. అందులో కొంతమంది బొమ్మలు అమ్మితే.. మరికొంత మంది గొడుగులు, రెయిన్ కోట్‌లు అమ్ముతున్నారు. ఇలా వినియోగదారులకు అందుబాటులో ఉంచడంతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



అందరికీ అందుబాటులో ఉండేలా..

జిల్లా పరిషత్ సెంటర్, బైపాస్ రోడ్, రోటరీనగర్, కాల్వొడ్డు, వరంగల్ క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో వీరు ఎక్కువగా వ్యాపారాన్ని సాగించేందుకు ఎంచుకుంటారు. ప్రధానదారుల వెంట అయితే వర్షం వచ్చిన సమయాన వ్యాపారం అధికంగా ఉంటుందని విక్రయదారులు చెబుతున్నారు. కాగా, జిల్లా కేంద్రమైన ఖమ్మానికి నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది వివిధ రకాల పనుల నిమిత్తం వచ్చి వెళ్తున్న సమయాన అకస్మాత్తుగా వర్షం వస్తే వినియోగదారులు గొడుగులు, రెయిన్ కోట్‌లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. వీరి అవసరాన్ని గుర్తించి ప్రధాన ప్రాంతాల్లో ఈ విక్రయాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

మొదటి నుంచీ ఇదే వ్యాపారం..

వర్షం వచ్చిన సమయాన ప్రధాన ప్రాంతాల్లో రెయిన్‌కోట్లు, గొడుగులు విక్రయాలు చేస్తున్నాం. ఈ సమయాల్లో మాత్రమే వినియోగదారులు వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిగతా సమయాల్లో కొనుగోళ్లు పెద్దగా ఉండవు. వర్షాకాలంలో ఈ వ్యాపారాన్ని చేయడం అలవాటు కావడంతో దీన్నే కొనసాగిస్తున్నాం.

\- ఖాన్, వ్యాపారి

వర్షానికి ఉపయోగపడుతుందని..



వర్షం వచ్చిన సమయాన రెయిన్‌కోట్, గొడుగులు ఉపయోగపడతాయని కొనుగోలు చేస్తున్నాం. ప్రతీ వానాకాలం గొడుగు తప్పనిసరి కావడంతో కొనాల్సి వస్తుంది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది కాబట్టి ముందస్తు జాగ్రత్తగా వీటిని కొని మా వెంట తీసుకొస్తాం.

\- కృష్ణ, ఖమ్మం నగరం

ఎన్నెస్పీ క్యాంపులో పందుల స్వైర విహారం



ఎన్నెస్పీ క్యాంపులో ఎస్సీ బాలుర సీ, ఆనంద నిలయం వసతిగృహాల్లో సంచరిస్తున్న పందులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరం మధ్యలో అటు కేఎంసీకి, ఇటు కొత్త బస్టాండ్‌కు మధ్యలో ఉన్న ఎన్నెస్పీ క్యాంపు స్థలాలు అధ్వానంగా తయారయ్యాయి. నగర శివారు ప్రాంతాలే కొంత మెరుగ్గా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నెస్పీ క్యాంపులో వసతిగృహాల చుట్టూ పందుల స్వైరవిహారం అధికారులను, విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడం, ఎన్నెస్పీ క్యాంపులో డ్రెయినేజీలు లేకపోవడం, అక్కడ కచ్చా డ్రెయినేజీల్లో పందులు సంచరిస్తుండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలు కురుస్తున్న సమయంలో పందుల సంచారంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయోననే ఆందోళనలో స్థానికులు, వసతిగృహాల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలకు తావిస్తున్న సర్దుబాట్లు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాట్లు అనేక అనుమానాలకి, అక్రమాలకు, అవినీతికి, పైరవీలకు అనుగుణంగా జరుగుతున్నట్టు అనుమానం ఉందని, సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవి నాగేశ్వరరావు, ఎస్.విజయ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్దుబాటులో అక్రమాలు జరిగితే డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఫిజికల్ సైన్స్ ప్రమోషన్లు ఇవ్వకుండా దాటవేస్తూ ఉపాధ్యాయులకు అన్యాయం చేశారని ఆరోపించారు. అనేకమంది ఉపాధ్యాయులు బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా భార్య భర్తలు ఒకే దగ్గరికి కోరుకోవాల్సి ఉండగా దూరంగా ఉన్న 17శాతం హెచ్‌ఆర్‌ఏ ప్లేసుల్లో కోరుకున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి నిబంధనలను రూపొందించి ఉపాధ్యాయ సంఘాల సమావేశం ఏర్పాటు చేసి పారదర్శకంగా సర్దుబాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్ రాజు, నాయకులు పద్మ, ముత్తయ్య, వీరబాబు, వెంకటేశ్వర్లు, వెంగళరావు, శ్యామ్ సుందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ!


దివ్యాంగుల హాస్టల్‌లో ఉంచిన వాహనాలు

దివ్యాంగులు ఏదైనా పనిపై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యాన గతేడాది అర్హులైన కొందరు మోటారు వాహనాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఏడు నెలల క్రితమే 25 మోటార్ వాహనాలు మంజూరై దివ్యాంగుల హాస్టల్‌లో వాటిని ఉంచారు. కానీ వాటిని ఇంకా పంపిణీ చేయకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. అంతేకాక వాటికి రక్షణ లేకుండా పోవడంతో కొన్ని భాగాలు చోరీకి గురవుతున్నాయి. ఇకనైనా వాటిని పంపిణీ చేయాలని గత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కొందరు దివ్యాంగులు కలెక్టర్‌ను కలిసి తమ గోడును వినిపించారు.

\- సాక్షి ఫొటో జర్నలిస్ట్


కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగులు

బీసీల కులగణన అమలు చేయాలి


అభివాదం చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల కులగణనపై ప్రకటన కాకుండా తక్షణమే అమలు చేయాలని సామాజిక విశ్లేషకులు సుంకర శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని పూలే అంబేడ్కర్ అధ్యయన వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలు ఐక్యంగా లేకపోవటంతోనే ప్రభుత్వాలు కులగణనపై మభ్యపెడుతున్నాయన్నారు. ఆగష్టు 18న సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నిర్వహించే బీసీల రిజర్వేషన్, భూసమస్యలపై సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాంబాబు, అల్లిక వెంకటేశ్వర్లు, లింగబోయిన లక్ష్మణ్, భద్రూనాయక్, శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్, వెంకయ్య, దామాల వెంకటేశ్వర్లు, రాజు, ప్రభాకరచారి, మట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం


ఆషాఢ పౌర్ణమి వేడుకలు

నేలకొండపల్లి: స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద ఆదివారం ధర్మ చక్ర పరివర్తన (ఆషాఢ పౌర్ణమి) వేడుకలు భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి బోధనలు, మహనీయులు మార్గాలు అనుసరణీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు కట్టెకోల వెంకటేశ్వర్లు, ఈదయ్య, పెద్దపాక వెంకటేశ్వరరావు, బొడ్డు బాబురావు, రాయపూడి నారాయణరావు, జస్వంత్, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

రాయల కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న తాత మధు, సండ్ర

తిరుమలాయపాలెం: ఇటీవల మృతిచెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్ కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిండిప్రోలులో పరామర్శించారు అనంతరం రాయల చంద్రశేఖర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తిరుమలాయపాలెం: భూమికోసం, భుక్తి కోసం, ప్రజల విముక్తి కోసం ఎన్నో పోరాటాలు కోసం ఉద్యమ బాట పట్టిన రాయల చంద్రశేఖర్ విప్లవ వీరుడని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. మండలంలోని దమ్మాయిగూడెం గ్రామంలో జరిగిన సంతాప సభలో మాట్లాడుతూ.. ఈనెల 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన సంతాప సభలు జరపాలని పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు అమలు చేయాలని, జులై 28న ఖమ్మంలో జరిగే రాష్ట్ర సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఉన్నం నరేష్, పమ్మి జగదీష్, మహేష్, నెహ్రు, వెంకన్న పాల్గొన్నారు.

తీజ్ సంబురాలు



నృత్యం చేస్తున్న మహిళలు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం చిన్న తండాలో ఆదివారం తీజ్ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మేళతాళాలతో, డప్పు, వాయిద్యాలతో వేడుకగా చేశారు. తొమ్మిది రోజుల పాటు వేడుకల్లో భాగంగా ముగింపు సందర్భంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ డీఈఈ కోటేశ్వరరావు, గిరిజన సంఘం ప్రతినిధులు పాల్తీయ రాజా, తేజావత్ కోటేశ్వరరావు, శివాజీ, రాంబాబు, వసంత్, రాము పాల్గొన్నారు.


బోనాల జాతర


ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో ఆదివారం బోనాల పండుగ జాతర ఘనంగా జరిగింది. ఉదయాన్నే మహిళలు బోనాలు తయారుచేసుకొని ఊరేగింపుగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, నృత్యాలతో వెళ్లి మారెమ్మ అమ్మవారికి వర్షాలు సమర్పించారు.

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ పంపింగ్ వెల్ రోడ్‌లో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పంపింగ్‌వెల్ రోడ్డు, గాంధీనగర్, మూడు బొమ్మల సెంటర్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొని పెద్దమ్మ తల్లికి బోనాలు చెల్లించారు. ఆలయ శాశ్వత చైర్మన్ బొల్లం సోమయ్య యాదవ్, అధ్యక్షులు బొమ్మదేవర పిచ్చయ్య, శ్రావణ్‌కుమార్, బండి నవీన్‌కుమార్, సారిక రాము, ముక్కాల రాజేష్, కందుకూరి సురేష్, అంకిత పాపారావు తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంరూరల్: బోనాలతో మహిళలు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడ నగర్ గ్రామం శివాయగూడెం వద్ద శ్రీగిరి పర్వతంపై వెలసిన స్వయంభు శ్రీ గంగా పార్వతీ సమేత సోమలింగేశ్వర స్వామి దేవస్థానంలోని అమ్మవారికి బోనాలు సమర్పించారు. కమిటీ బాధ్యులు రాంబాబు, సిద్దయ్య ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.


ఖమ్మంగాంధీచౌక్: పెద్దమతల్లి ఆలయానికి..


రఘునాథపాలెంలో..

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

ఖమంగాంధీచౌక్: సాయినాథుని మందిరాల్లో, ఆశ్రమాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. నగరంలోని గాంధీచౌక్ శ్రీ వరప్రదాత షిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథునికి పంచామృతాలు, నదీజలాలు, పళ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం సాయినాథున్ని అలంకరించి విశేషార్చన, దర్శనం వంటి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక సంకీర్తనలను నిర్వహించారు. ఈ సందర్భంగా 13 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు ఉన్నారు. అదేవిధంగా హర్కారాబావి రోడ్డు రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు, మహాన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, ఉపాధ్యక్షుడు చొడవరపు మధుసూదన్ రావు, కొదుమూరి శ్రీనివాస రావు, నరహరి రమేష్‌కుమార్, పుల్లఖండం వెంకటరామారావు, కోశాధికారి కేతేపల్లి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: గురుపౌర్ణమి పురష్కరించుకొని నగరంలోని పలు కాలనీల్లోని సాయి మందిరల్లో, రఘునాథపాలెం మండలాల్లో మందిర కమిటీల ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

కామేపల్లి: మండలంలోని కామేపల్లి, పండితాపురం గ్రామాల్లోని సాయి మందిరాల్లో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.భక్తుల సాయి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లి శివారు రాజీవ్‌గృహకల్పలోని సాయి సేవాశ్రమంలో ఆదివారం రియల్టర్ మన్నేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్: నగరంలోని 3వ డివిజన్ జయనగర్ కాలనీ, జన్మభూమిరోడ్డు, రెహానా ఐటీఐ పక్కసందులోని మాతృశ్రీ అనగాదేవి సమేత దత్తాత్రేయ శివసాయి మందిరంలో 3వ డివిజన్ కార్పొరేటర్ మలీద్ జగన్మోహన్ రావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భగవాన్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మలీదు హైమావతి, టీ.అంజనేయ శర్మ, మాజీ ఎంపీపీ బండి సత్యం, కొనకంచి వర ప్రసాదు , రామలింగం, సింహాద్రి, ఎం.నాగార్జున, భీష్మ చారి, చిట్టిబాబు , గుర్రం రవీందర్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మంగాంధీచౌక్: సాయినాథున్ని దర్శించుకుంటున్న భక్తులు


రఘునాథపాలెం: మధురానగర్‌లో..


కామేపల్లి: పండితాపురంలో..


ఖమ్మంఅర్బన్: జయనగర్ కాలనీలో..


ఖమ్మంరూరల్: అన్నదాన కార్యక్రమం